# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి 45 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు విశాఖ నగరం వేదికగా రేపు ప్రారంభం కానుంది.

- ఆంధ్రప్రదేశ్ లో వేగవంతమైన వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

- సీఐఐ భాగస్వామ్య సదస్సుతో పర్యాటక రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

====================

భవిష్యత్ ప్రాధాన్యత రంగాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్టణంలో ఈరోజు జరిగిన ఇండియా-యూరప్ బిజినెస్ పార్టనర్ షిప్ రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విశాఖపట్టణం అద్భుతమైన సాగర తీర నగరమని, మంచి వనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయన్నారు. గూగుల్ సంస్థ కృత్రిమ మేధ (ఏఐ) డేటా సెంటర్‌ను విశాఖలోనే ఏర్పాటు చేస్తోందని, దీంతో పాటు అనేక కంపెనీలు విశాఖకు తరలివస్తున్నాయని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ..

(వాయిస్ 31 సెకన్లు)

అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని, పెట్టుబడులు పెడితే 45 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన ఉత్పత్తికి ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. దేశంలో తొలి క్వాంటం వ్యాలీని రాష్ట్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నౌకా నిర్మాణ రంగంలో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలి కోరారు. ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించడానికి ఆంధ్రప్రదేశ్ గేట్ వేగా ఉంటుందని, పారిశ్రామిక ఉత్పత్తులు, విద్య, వైద్యం, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

====================

విశాఖపట్నంలో రేపటి నుంచి జరగనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుని ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును సీఐఐ ఆధ్వర్యంలో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖలోని పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (DPIIT), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో 72 మంది అంతర్జాతీయ వక్తలు, 45 దేశాల నుంచి 300 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొననున్నారు.  వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికతల భవిష్యత్ దిశను నిర్ణయించే చర్చలు ఈ సదస్సులో చోటుచేసుకోనున్నాయి.

====================

విశాఖపట్నం మధురవాడలోని ఐటీ హిల్స్‌లో పలు కంపెనీలకు రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ కొద్ది సేపటి క్రితం భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్ వంటి కంపెనీలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ విశాఖకు వస్తుందన్నారు. దీంతో వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటుంది. ఈ సదస్సుకు ఒక రోజు ముందుగానే 35 సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంది. మొత్తం 3.65 లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 1.26 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. రెన్యూ పవర్ 62 వేల కోట్ల రూపాయలు, eJoule 19 వేల కోట్లు, తైవాన్ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ 1200 కోట్లు, కోరమాండల్ 2 వేల కోట్లు, హీరో ఫ్యూచర్ ఎనర్జీ 15 వేల కోట్లు, JOOL 1,500 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి ఆరు కంపెనీలతో ఇప్పటి వరకు ఒప్పందాలు జరిగాయి. అదే విధంగా మరో 29 సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది.

విరామం

====================

అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికల ప్రక్రియను మరింత పెంచాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటనపై ఉపముఖ్యమంత్రి స్పందించారు. ఈ ఘటనపై పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో ఆయన ఈరోజు చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల వారీగా సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటు చేసి సందేశాల రూపంలో ముందస్తు సమాచారం చేరవేయాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.

====================

ఆంధ్రప్రదేశ్ లో సరికొత్త పర్యాటకానికి బాటలు వేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. విశాఖలో రేపటి నుండి జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి పర్యాటక రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయని మంత్రి వెల్లడించారు. విశాఖలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించి పర్యాటక రంగంలో పెట్టుబడులు

ఆహ్వానించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక రంగంలో 98 ఒప్పందాలు చేసుకొన్నామని తెలిపారు. దీంతో అన్ని వర్గాల వారికి పర్యాటకం అందుబాటులో ఉంటుందని చెప్పారు. సముద్ర తీరంలో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, పర్యాటక రంగంలో మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులతో పాటు 2, 3 స్టార్ హోటళ్లు తీసుకువస్తున్నామన్నారు. ఎకో టూరిజంలో సమూల మార్పులు చేయబోతున్నామని తెలిపారు. పారిశ్రామిక హోదా కల్పన, నూతన పర్యాటక పాలసీతో పర్యాటక రంగానికి ఊతం వచ్చిందని కందుల దుర్గేష్ వివరించారు.

====================

శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించే సర్దార్ @ 150 ఐక్యతా మార్చ్ విజయవంతం చేయాలని స్థానిక శాసన సభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. కదిరిలోని ఈ ఐక్యతా మార్చ్ కు సంబంధించిన గోడపత్రికను ఆయన ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని 15వ తేదీన ఈ యూనిటీ రన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

====================

బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ బాలబాలికలకు ఈరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశ తొలి ప్రధానమంత్రి, భారతరత్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ పిల్లల పట్ల ఎనలేని ప్రేమ, ఆప్యాయతను చూపారని, వారే దేశానికి నిజమైన బలం, భవిష్యత్ అని ఆయన విశ్వసించారన్నారు. నేటి పిల్లలే.. రేపటి భారతదేశాన్ని తీర్చిదిద్దుతారని, వారిని పెంచే విధానం దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు.

====================

ఆంధ్రప్రదేశ్ లో ఇటాలియన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ దేశ రాయబారి ఆంటోనియో ఎన్రికో బార్టోలీని కోరారు. విశాఖపట్నంలోని సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వివిధ దేశాల రాయబారులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. దీనిలో భాగంగా భారతదేశంలోని ఇటలీ రాయబారితో ఈరోజు సమావేశమయ్యారు. కీలక రంగాలైన ఆటోమోటివ్, యంత్రాల తయారీ, ఇంధనం, ఆహార శుద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ యంత్రాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, నౌకా నిర్మాణ రంగాలలో భాగస్వాములు కావాలని ఇటాలియన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఏపీ-ఇటలీ మధ్య దీర్ఘకాలిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్రంలో ఒక ఇండస్ట్రియల్ క్లస్టర్ ను ఏర్పాటు చేసే అంశంపై చంద్రబాబు నాయుడు బార్టోలీ మధ్య చర్చలు జరిగాయి.

====================

ముఖ్యమంత్రి సహాయ నిధి.. పేదల పాలిట పెన్నిధిగా నిలుస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులోని M P కార్యాలయంలో సుమారు 18 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 10,89,041 రూపాయల చెక్కులను  ఈరోజు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి ఈ విధంగా ఆపన్న హస్తాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు చేయూతనివ్వడంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలియజేశారు.

====================
====================